క్లుప్తంగా

ఆలయంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పూజలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ఆలయ ప్రతిష్టాపన మహోత్సవాన్ని నిర్వాహకులు గురువారం చేపట్టగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన తోడ్పాటు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, సర్పంచ్ దూడల ప్రమీల, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ యాటపోలు రజుమణి శ్రీనివాస్, కాసం రమేష్ పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి 'మన కామారం' తోడ్పాటు

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన పేదరాలి వివాహానికి కామారం గ్రామానికి చెందిన 'మన కామారం' వాట్సప్ గ్రూప్ తోడ్పాటు అందించింది. పెద్దాపురం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నర్మెట రజిత తన కూతురు ప్రియాంక వివాహాన్ని గురువారం నిర్వహించింది. రజిత పేదరికంతో ఇబ్బంది పడుతుండడాన్ని గమనించి 'మన కామారం' గ్రూప్ అడ్మిన్, సభ్యులు వివాహ నిర్వహణ కోసం రూ.36 వేల సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట కుమారస్వామి, ఉపసర్పంచ్ కానర్ల శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి గ్రామ శాఖ కోఆర్డినేటర్ మూల కన్నయ్య, వార్డు సభ్యులు కంది కిషన్‌రెడ్డి, తిప్పని కిరణ్, ఎలగొండ ప్రభాకర్, నర్మెట రాజేష్, తోట దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

శాయంపేట : మండలంలోని అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంపూరి సంజీవరావు-విమల దంపతులను ఎమ్మెల్సీ మధుసూదనాచారి గురువారం పరామర్శించారు. సంజీవరావు భార్య విమల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి వారిని ఎమ్మెల్సీ మధుసూదన్‌రెడ్డి కలిసి మాట్లాడారు. అనారోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. తనతోపాటు పార్టీ, ప్రభుత్వ అండ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, సర్పంచ్ రఘుసాల సంజీవరావు, నాయకులు జనగాం సత్యం, సిరికొండ యువసేన జిల్లా నాయకుడు బెరుగు రాకేష్, పీఏసీఎస్ డైరెక్టర్ భగ్గి రమేష్, నాయకులు తోకల సమ్మిరెడ్డి, ఎస్‌కే.గౌస్, పెండెం శ్రీను, నాగరాజు, రాజన్న, గణేష్, రాజు పాల్గొన్నారు.

పీపీఐ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

ఎల్కతుర్తి : పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (పీపీఐ) జిల్లా అధ్యక్షుడిగా తనను రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ ఎన్నుకున్నట్లు మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన జన్ను రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి పని చేస్తానని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించారంటూ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం రఘుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. సమావేశంలో నాయకులు కట్కూరి సురేష్, ఈరెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి పర్సు అప్పగింత

హన్మకొండ: బస్సులో పోగొట్టుకున్న పర్సును ప్రయాణికురాలికి ఆర్టీసీ అధికారులు తిరిగి అందించారు. తిమ్మంపేట గ్రామానికి చెందిన సంగతి రజిత.. నర్సంపేట డిపోకు చెందిన బస్సులో నర్సంపేట నుంచి వరంగల్‌కు ప్రయాణిస్తూ బస్సులోనే పర్సు పోగొట్టుకుంది. అనంతరం బాధితురాలు నర్సంపేట కంట్రోలర్ ఈశ్వర్‌కు ఫిర్యాదు చేయగా పర్సును అధికారులు స్వాధీనం చేసుకుని ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత ప్రయాణికురాలి కుటుంబ సభ్యులకు గురువారం అందించారు.

కాకతీయ వైద్యకళాశాలకు పార్థివదేహం అప్పగింత

ఎంజీఎం: కేఎంసీకి పార్థివదేహాన్ని గురువారం అప్పగించినట్లు నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రు మల్లారెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ వృద్ధాశ్రమం వాసి జగదాంబ(85) మృతి చెందగా నిర్వాహకులు చోటు, యాకుబ్ సహకారంతో జగదాంబ పార్థివ దేహాన్ని అప్పగించినట్లు మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, రాజమౌళి, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే 'చలివాగు బ్రిడ్జి' పూర్తి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వ చొరవ వల్లే చలివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తైందని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తెలిపారు. మండలంలోని కొప్పుల–జోగంపల్లి గ్రామాల నడుమ ఉన్న చలివాగుపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడారు. చలివాగు బ్రిడ్జిని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.7.90 కోట్ల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిందన్నారు. శాయంపేట, రేగొండ మండలంలోని గ్రామాలకు వెళ్లడానికి మార్గం సుగమమైందని చెప్పారు. గతంలో చలివాగులో అలుగు పడినప్పుడల్లా ఉధృతంగా నీరు ప్రవహించి రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించేవని, కొప్పుల ప్రజలు వసంతాపూర్, ప్రగతి సింగారం, పత్తిపాక గ్రామాల మీదుగా శాయంపేట మండల కేంద్రానికి వచ్చే వారని గుర్తు చేశారు. గతంలో వర్షాకాలంలో లోలెవల్ వంతెన పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహించిన సందర్భాల్లో ఇద్దరు గల్లంతవగా సమస్య తీవ్రతను మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమాదేవి నాడు స్పీకర్‌గా ఉన్న తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ క్రమంలోనే తాను స్పందించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించినందుకు మధుసూదనాచారికి మాజీ జెడ్పీటీసీ వంగాల రమాదేవి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేష్, నాయకులు తోకల సమ్మిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

'మిషన్ వాత్సల్య'పై అవగాహన కల్పించాలి

శాయంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలౌతున్న 'మిషన్ వాత్సల్య' పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు నేరేడుపల్లి సర్పంచ్ ఆకుతోట రాజేష్ సూచించారు. మండలంలోని ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (వీసీపీసీ) సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను గుర్తించి మిషన్ వాత్సల్య పథకం కింద ఎంపిక చేసి తీర్మానం ద్వారా జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని చెప్పారు. పథకం కింద ఎంపికైన బాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేస్తాయని తెలిపారు. పథకాన్ని అర్హులు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు చొరవ తీసుకుని అర్హులకు పథకం వర్తింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ ఆకుతోట రాజేష్

'ఎస్సై అనిల్‌ను కఠినంగా శిక్షించాలి'

శాయంపేట : ముస్లిం విద్యార్థినిపై చేయి చేసుకుని అనుచితంగా ప్రవర్తించిన జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య (ఏబీఎస్‌ఎఫ్) జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తులపై చర్యలు తీసుకుని బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసు అధికారి అధికార దురహంకారంతో మైనార్టీకి చెందిన ముస్లిం విద్యార్థినిపై దౌర్జన్యానికి తెగబడడం దుర్మార్గమన్నారు. పోలీసు అధికారి అయి ఉండి విద్యార్థినిపై చేయి చేసుకోవడం అత్యంత దారుణమని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పోలీసు శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి ఎస్సై అనిల్‌ను విధుల నుంచి పర్మినెంట్‌గా తొలగించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని చెప్పారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు కొంగర విజయ్, ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు తరుణ్, కన్నా, శివ, నాగులు, చింటు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ కళాశాల్లో విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. నగరంలోని వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో 2023 -2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలకే విద్యార్థులు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పింగిళి కళాశాలను కార్పొరేట్ కళాశాలగా ప్రభుత్వం తీర్చిదిద్ది, నిపుణులైన అధ్యాపకులతో బోధన అందిస్తున్నట్లు తెలిపారు. పింగిళి కళాశాలలో సాంప్రదాయకమైన డిగ్రీ కోర్సులతో పాటు, ఉపాధి కల్పన కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు పరిశోధన, సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, క్రీడలు, వివిధ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పార్వతి, అడిషనల్ కంట్రోలర్లు రేణుక, శిరీష, లైబ్రరీ ఇన్‌చార్జ్ జగదీష్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్, తదితరులు

మెరుగైన తపాలా సేవలు అందించాలి



అనురాగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నంద

హన్మకొండ: ప్రజలకు మెరుగైన తపాలా సేవలు అందించాలని పోస్టల్ సర్వీస్ బోర్డు మెంబర్ (ఆపరేషన్) ఎండ్రీ అనురాగ్ అన్నారు. కాజీపేటలోని నోడల్ పోస్టల్ డెలివరీ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. ఈమేరకు అనురాగ్‌కు తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ బానోతు నంద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం నోడల్ పోస్టల్ డెలివరీ సెంటర్‌ను అనురాగ్ పరిశీలించి మాట్లాడారు. బట్వాడలో మరింత వేగం పెంచాలని సూచించారు. సత్వర పోస్టల్ సేవలు అందించేందుకు నోడల్ పోస్టల్ డెలివరీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న అస్ర ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష

నయీంనగర్: మెరికల్లాంటి సివిల్ సర్వీస్ ఆశావహులను ఎంపిక చేయడానికి ఈనెల 21న ఆన్‌లైన్ పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన అస్ర ఎనలాగ్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు శ్రీకాంత్ విన్నకోట తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అగ్రగణ్యులుగా నిలిచిన వారికి వందశాతం రాయితీని ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లోని 67 జిల్లాల్లో అత్యధిక శాతం మార్కులు సాధించిన తొలి మూడు స్థానాల్లో నిలిచేవారికి భారీ ఉపకార వేతనాలుంటాయని చెప్పారు. వివరాలకు 84949 90066 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న పెండెం రాజు

విద్యారణ్యపురి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, జనరల్ సెక్రటరీలు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, కాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు 14 రోజులుగా హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద సమ్మె చేస్తున్న జేపీఎస్‌ల శిబిరాన్ని గురువారం వారు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సంఘీభావం తెలిపిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు సీహెచ్.రవీందర్‌రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఎంఏ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనంలో చోరీ



ఐనవోలు : మండలంలోని పంథిని రెవెన్యూ పరిధిలోని కక్కిరాలపల్లి క్రాస్ వద్ద ఉన్న స్మృతివనంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి స్మృతివనంలోకి అక్రమంగా ప్రవేశించి వాచ్‌మెన్ బాషబోయిన యాకయ్యపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. అనంతరం స్మృతివనంలోని 55 ఇంచుల ఎల్‌ఈడీ టీవీతోపాటు రెండు స్పీకర్లు, ఆంప్లీ ఫైర్ బాక్స్‌లను చోరీ చేశారు. స్మృతివనం నిర్వాహకుడు నాయిని అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకన్న ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.1.50 లక్షల విలువ ఉంటుందని అనిల్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఐనవోలు : వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కక్కిరాలపల్లి శివారులోని కాశగూడెంకు చెందిన ఎస్కే.యాకూబ్ గురువారం మృతి చెందాడు. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన యాకూబ్ ఐనవోలు మండలంలోని కాశగూడెంలో ఉంటూ బండకొట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 6న యాకూబ్ తన గేదెను మేపుతూ దాని వెంట పరిగెడుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి రాయి తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆయన్ను స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా గురువారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సునీల్‌కు డాక్టరేట్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని వినూత్న కళాశాల డైరెక్టర్ కె.సునీల్ కుమార్‌కు వరంగల్‌లోని నిట్ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'డెవలప్‌మెంట్ ఆఫ్ నోవెల్ రోబస్ట్ స్పీచ్ బ్యాండ్విడ్జ్ ఎక్స్‌టెన్షన్ టెక్నిక్' అనే అంశంపై ప్రొఫెసర్ కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సునీల్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. ఈమేరకు ఆయనకు వినూత్న కళాశాల కార్యదర్శి డాక్టర్ కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి జి.రవీందర్‌రావు తదితరులు అభినందనలు తెలిపారు.

అంత్యక్రియలకు సాయం

కాశిబుగ్గ: వరంగల్ 35వ డివిజన్ ఏసీరెడ్డినగర్‌కు చెందిన కంద్రాతి రాజు (38) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి వివరాలను ఎమ్మెల్యే నరేందర్ దృష్టికి కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ తీసుకెళ్లగా దహన సంస్కారాలకు రూ.10 వేలు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కార్పొరేటర్ భరోసా ఇచ్చారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

హన్మకొండ: ప్రజాసేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. తన పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య గురువారం జరుపుకున్నారు. వడ్డేపల్లి ఎస్సీ కాలనీ, సమ్మయ్యనగర్, పోచమ్మకుంట, దీన్‌దయాల్ నగర్, కాకతీయ కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేత్రాలను అశ్రద్ధ చేయొద్దు



హన్మకొండ చౌరస్తా: నేత్రాల పట్ల అశ్రద్ధ వహించొద్దని హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు శరత్ మ్యాక్స్‌విజన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ అభ్యర్థులకు పుస్తకాలు, వసతులు కల్పించడమే కాకుండా వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ 11వ డివిజన్ అధ్యక్షుడు సృజన్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సార్' విద్యార్థులకు సన్మానం

పరకాల : పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన ఎస్సార్ పాఠశాల విద్యార్థులను ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ ఎ.శశిధర్, ప్రిన్సిపాల్ విజయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ రాజీ రతన్ ప్రసాద్ గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. పట్టణంలోని ఆ పాఠశాల విద్యార్థులు కె.హాసిని, పి.శివాని, ఆర్.నందిత, ఎ.వర్ష, ఆర్వి.సోవంతి 10 జీపీఏ సాధించారు. ఈ క్రమంలో వారిని ఆ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డితోపాటు డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయశ్రీ మాట్లాడారు. ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దడంలో యాజమాన్యం, అధ్యాపకులు అవిశ్రాంతంగా పాటుపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ విజయశ్రీ

రైతుల సంక్షేమమే సీఎం లక్ష్యం

దామెర : రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు స్పష్టం చేశారు. మండలంలోని ఊరుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన మక్కల, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు సరైన ధర లభించాలనే ఉద్దేశ్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని పంట ఉత్పత్తులకు మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయిస్తే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహ్మద్ జాకిర్ అలీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, సర్పంచ్ గోగుల సత్యనారాయణ, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, నాయకులు పొడాల మధూకర్, కునాటి సునీల్, రఘుపతిరెడ్డి, జన్ను వినయ్, పొలెపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాజు

15 నుంచి సీఎం కప్ 'మండల' పోటీలు

కమలాపూర్ : ఈనెల 15 నుంచి 17 వరకు సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ తడక రాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో క్రీడా పోటీల నిర్వహణ కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ జి.పల్లవి, ఎంఈఓ రాంకిషన్‌రాజులతో కలిసి ఎంపీపీ రాణి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 నుంచి 36 ఏళ్ల వరకు వయసున్న విద్యార్థులు, యువతకు స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలుర గురుకుల పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణల్లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు అన్ని గ్రామాల నుంచి ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో టీమ్ చొప్పున మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ)లో ఈనెల 14న సాయంత్రం 4 గంటల వరకు తమ పేర్లు నమోదు చేసుకుని ఎంట్రీ ఫారాలు సిబ్బందికి అందజేయాలని తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు, యువత పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయాలని సూచించారు. మండల స్థాయి విజేతలు ఈనెల 22 నుంచి 24 వరకు హనుమకొండలోని జేఎన్ (జవహర్‌లాల్ నెహ్రూ) స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9573171121, 9676968561ల్లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ కల్యాణి, తహసీల్దార్ రాణి, ఎస్సై చరణ్ తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : మాట్లాడుతున్న ఎంపీపీ రాణి

కట్టయ్య ఆశయ సాధనకు పాటుపడాలి

కరీమాబాద్: దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఉద్యమించిన బొమ్మల కట్టయ్య ఆశయ సాధనకు ప్రతీఒక్కరు పాటుపడాలని శాసనమండలి డిప్యూటీ వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. కరీమాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో దళితరత్న, అంబేడ్కర్ వాది, బౌద్ధిస్టు ఉపాసక బొమ్మల కట్టయ్య రెండవ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బొమ్మల అంబేడ్కర్ అధ్యక్షత వహించగా బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై మాట్లాడారు. నగరంలో కట్టయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు, గౌతమ బుద్ధుడి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, రిటైర్డ్ సీపీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అందరిని గౌరవించే వారు యాదవులు'

హన్మకొండ: అందరిని గౌరవించే వారు యాదవులు అని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ అన్నారు. అలాంటి వారిపై నోరు జారడం సరికాదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. హనుమకొండ బ్యాంకు కాలనీలోని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ స్వగృహంలో అఖిల భారత యాదవ మహాసభ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాజయ్య యాదవ్ మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు హుందాగా ఉండాలని సూచించారు. మంత్రికి, యాదవ సమాజానికి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఆశలపల్లి సర్పంచ్ కిశోర్ యాదవ్, జనగామ జిల్లా అధ్యక్షుడు సిద్దిరాజ్ యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లావుల కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం మెరుగు

ఖిలా వరంగల్: ప్రజల భాగస్వామ్యంలోనే పారిశుద్ధ్యం మెరుగవుతుందని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్నేహలత అన్నారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్వచ్ఛ వరంగల్ పౌర సంఘాల వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛ పౌర సంఘాల వేదిక కన్వీనర్ పుల్లూరు సుధాకర్ అధ్యక్షతన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజల మద్దతు తప్పనిసరి అని అన్నారు. అనంతరం మార్పు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి, ప్రముఖ కవి, గాయకుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, మహిళలు స్వచ్ఛ వరంగల్ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడానికి ఒక ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. సమావేశంలో మల్లారెడ్డి, పరశురాములు, కర్ని రవీందర్, ఉల్ఫత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్నేహలత